సాక్షి
చిత్తూరు
శనివారం । 4 । అక్టోబర్ । 2025



విస్తృత అవగాహన
సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలని జేసీ విద్యాధరి పిలుపునిచ్చారు.
- 10లో



పిడికిలి బిగించిన పల్లె వైద్యులు!
పీహెచ్‌సీ వైద్యులు పిడికిలి బిగించారు. డిమాండ్ల సాధనకోసం ఏకంగా పోరుబాట పట్టారు.
- 10లో



మీరే సూదులేస్తారా?
'మీరు పీఎంపీలు.. ఎంబీబీఎస్‌ల్లాగా మీరే సూదులెలా వేస్తారు.' అంటూ డీఅండ్‌హెచ్‌ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- 10లో

న్యూస్‌రీల్

పంట పొలాలపై ఏనుగుల దాడి



మేకలవారిపల్లె వద్ద ధ్వంసమైన టమాట పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లె, మేకలవారిపల్లె పంచాయతీల్లో ఏనుగులు గురువారం తెల్లవారు జామున పంట పొలాలపై దాడిచేశాయి. మతుకువారిపల్లెలో రాజారెడ్డి, రవిరెడ్డి పొలంలో వరి పంటను తొక్కిపడేశాయి. మేకలవారిపల్లెలో మల్లికార్జున పొలంలో సాగులో ఉన్న టమాట పంటను ధ్వంసం చేశాయి. ఫారెస్టు అధికారులు ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు.

నియామకం

చిత్తూరు అర్బన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా నుంచి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు పూతలపట్టు నుంచి లలితకుమారి, కుప్పం నుంచి సెంథిల్‌కుమార్, పలమనేరు నుంచి సీ.వీ.కుమార్ నియమితులైనట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శిక్షణ ప్రారంభం



చిత్తూరులో జరుగుతున్న శిక్షణ

చిత్తూరు అర్బన్: డీఎస్సీ 2025లో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఎంపికైన ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయులుగా నియామక ఉత్తర్వులు అందుకున్న టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 1,407 మందికి గాను 1,398 మంది హాజరు కాగా, తొమ్మిది మంది గైర్హాజయ్యారు. చిత్తూరులోని ఆర్‌కే పాఠశాలలో 118 మంది, ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 150 మంది.. తిరుపతి కేంద్రంగా నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 211 మంది, విశ్వం స్కూల్లో 249 మంది, మెడ్జీ స్కూల్లో 449 మంది, ఆదిశంకర ఇంజినీరింగ్ కాళాశాలలో 221 మంది హాజరయ్యారు. చిత్తూరులో డీఈవో వరలక్ష్మి, తిరుపతిలో డీఈవో కేవీఎస్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో సమగ్రశిక్ష ఏపీసీల సహకారంతో కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

బానిస బతుకుల నుంచి విముక్తికి పోరాటం చేయడమే ఆయన చేసిన తప్పా...? పేద వాడు అందరితో పాటు సమానంగా తలెత్తుకు తిరగాలనుకోవడమే ఆయనకు శాపంగా మారిందా...? సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగాలన్న ఆకాంక్షే ఆయన చేసిన నేరమా..? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు మహిళలకు తీసుకొచ్చిన రిజర్వేషన్ ఆ మహనీయుని పాలిట శత్రువైందా..?అంటే కూటమి పాలనలో అవుననే సమాధానం వస్తోంది. కూటమి కొలువుదీరినప్పటి నుంచీ అడుగడుగునా అవమానమే ఎదురవుతోంది. దళితుల ఆశాజ్యోతి అంబేడ్కర్ విగ్రహాలకు నిప్పు పెట్టడం... చెప్పుల దండలు వేసి అవమానించడం రివాజుగా మారుతోంది. తమ ఆత్మగౌరవానికి నిప్పు పెడుతుంటే.. అధికారులు, నేతలకు కనువిప్పు లేదా..? అంటూ దళిత వర్గాలు మండిపడుతున్నాయి. వెదురుకుప్పం మండలం, దేవళంపేట ఘటనను తీవ్రంగా ఖండించాయి. శుక్రవారం రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగాయి.





నగరి డీఎస్పీ కాళ్లు పట్టుకుంటున్న సర్పంచ్ గోవిందయ్య

ఆత్మగౌరవానికి నిప్పు..
లేదా కనువిప్పు!

- దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడం దారుణం
- దళితుల ఆత్మగౌరవాన్ని కాల్చి వేస్తున్నారు
- నేడు విగ్రహానికి నిప్పు.. రేపు మమ్మల్ని ఏం చేస్తారో?
- ఆందోళనకు దిగిన దళిత సంఘాలు
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

దళితులకు అండగా వైఎస్సార్‌సీపీ



దళితులకు అండగా నిలిచిన మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు

దేవళంపేటలో జరిగిన ఘటనతో బడుగు బలహీనవర్గాలకు అండగా వైఎస్సార్‌సీపీ నిలిచింది. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మితో పాటు కార్వేటినగరం, పెనుమూరు, శ్రీరంగరాజపురం మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని నిందితుల చర్యలను తీవ్రంగా ఖండించారు. ఎంతటి వారినైనా శిక్షించాలంటూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. న్యాయం జరగకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించాయి.

వెదురుకుప్పం: మండలంలో దారుణం చోటు చేసుకుంది. దళితుల ఆశాజ్యోతి, బడుగు, బలహీన వర్గాల పెన్నిధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం కలకలం రేగింది. అగ్రవర్ణ దురహంకారులను అరెస్ట్ చేయాలంటూ దళిత వర్గాలు నిరసనకు దిగాయి.

అసలేం జరిగిందంటే!

దేవళంపేటలో స్థానిక సర్పంచ్ గోవిందయ్య 2023లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. దేవళంపేట–తిరుపతి ప్రధాన రహదారి పక్కన ఉన్న స్థలంలో విగ్రహాన్ని నెలకొల్పారు. ఆ స్థలాన్ని స్థానికంగా కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. వారి ప్రయత్నాలను అడ్డుకుంటూ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అప్పట్లోనే పరోక్షంగా సర్పంచ్ గోవిందయ్యపై కొందరు టీడీపీ నేతలు భగ్గుమన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్ వద్దకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని టీడీపీ నేత సతీష్ నాయుడు కులం పేరుతో దూషించారు. అధికారం రావడంతో సర్పంచ్‌పై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసి చెక్ పవర్‌ను రద్దు చేయించారు. అంతటితో ఆగకుండా సర్పంచ్‌పై పలు కేసులు పెట్టించి వేధించారు. వాటన్నిటికీ వెరవకుండా వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో టీడీపీకి చెందిన సతీష్ నాయుడు, అతని అనుచరులు కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టేందుకు పూనుకున్నారు.

ఉలిక్కిపడ్డ దళితులు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోలు పోసి తగలబెట్టారు. దీంతో ఒక్కసారిగా దళితులు ఉలిక్కిపడ్డారు. పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఏకమయ్యారు. అగ్రవర్ణ దురహంకారుల దుశ్చర్యను ఖండించాయి. రేపు మమ్మల్ని ఏం చేస్తారోనని రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు.

కాళ్లు పట్టుకుంటాం.. న్యాయం చేయండి

మీ కాళ్లు పట్టుకుంటాం.. ఇక మమ్మల్ని బతకనివ్వరు.. మాకు న్యాయం చేయండంటూ సర్పంచ్ గోవిందయ్య ఏకంగా నగరి డీఎస్పీ మహ్మద్‌అజీజ్ కాళ్లు పట్టుకున్నారు. ఇదిలా ఉండగా చిత్తూరు ఎస్పీ తుషార్‌డూడిని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి వెదురుకుప్పం పోలీసు స్టేషన్‌లో కలిసి.. పోలీసుల వైఫల్యం, వారి తీరును ఎండగట్టారు. వారి నిర్లక్ష్యంతోనే నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు జరుగుతన్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బందార్లపల్లె ఘటనను గుర్తుచేశారు. బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ భాస్కర్‌కు జరిగిన అవమానాన్ని గుర్తుచేసి న్యాయం చేయాలని కోరారు. ఈనెల 25లోపు నిందితులను పట్టుకుని శిక్షించాలని సూచించారు.

ఆది నుంచీ అరాచకమే



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ వారు చేస్తున్న అరాచకాలకు హద్దుల్లేవు. ఇది అన్యాయం అని ప్రశ్నిస్తే అడిగిన వాళ్లపైనే కేసులు నమోదు చేస్తున్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోంది. అంబేడ్కర్ విగ్రహాలను కూల్చి వేయడం, చెప్పుల మాలలు వేసి అవమానించడం, నిప్పు పెట్టడం వంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. మహిళలు, వృద్ధులు, బాలికలు ఇలా అందరూ కూటమి పాలనలో దాడులకు గురవుతున్నారు. అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీలకే కాదు అందరికీ దారి చూపించాడు. ప్రతిక్కరికీ దైవ స్వరూపమైన అంబేడ్కర్‌కి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు. **- కే.కృపాలక్ష్మి, జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి**

నూతన విగ్రహావిష్కరణ



దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి దుండగులు నిప్పు పెట్టడంతో అదే స్థానంలో నూతన విగ్రహాన్ని అధికారులు ఆవిష్కరించారు. ఆగమేఘాల మీద అధికారులు కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

కలెక్టర్ ఆరా..



కలెక్టర్,ఎస్పీ,ఎమ్మెల్యేల ఆరా

దేవళంపేట ఘటనపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆరా తీశారు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సీసీ ఫుటేజీలు, ఫోన్ సంభాషణలు, అర్ధరాత్రి ఎవరు తిరిగారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యేలు థామస్, మురళీ మోహన్ కూడా స్పందించారు. విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని అధికారులను ఆదేశించారు.

వారిని అరెస్టు చేయాలి

కార్వేటినగరం: రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన అగ్రవర్ణ దురహంకారులను అరెస్టు చేయాలని శుక్రవారం కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో దళిత నాయకులు భారీ ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అంబేడ్కర్ కీర్తి ప్రతిష్టలను కొనియాడుతుంటే, దళిత నియోజకవర్గంలో అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేయడం హేయమైన చర్య అన్నారు. అగ్రవర్ణ దురహంకారులను రాజకీయాలకు అతీతంగా కఠినంగా శిక్షించాలన్నారు. దళితవర్గ ఆశాజ్యోతి అంబేడ్కర్‌కు జరిగిన అవమానానికి దేశ వ్యాప్తంగా ఉద్యమం చేయడానికి కూడా వెనుకాడ బోమని హెచ్చరించారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడం భారత రాజ్యాంగానికి నిప్పు పెట్టినట్టేనన్నారు. దళిత దేవుడ్ని కించపరిస్తే దళితజాతి ఊరుకోబోదన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ క్రమంలో పుత్తూరు, చిత్తూరు జాతీయ రహదారిపై వాహనాలు భారీ స్థాయిలో స్తంభించాయి. దళిత ఉద్యోగ నాయకులు చలపతిరావు, వెంకటేష్, దొరబాబు, వేమయ్య, రామూర్తి, నాగభూషణం, రవి, గంగాధరం, భాస్కర్, కొత్త పల్లి సుబ్రమణ్యం, సోము, దొరబాబు, శేషాద్రి, కిరణ్, పాపయ్య పాల్గొన్నారు. అలాగే మండలంలోని గోపిశెట్టిపల్లిలో కూడా దళిత నాయకులు ఎంపీటీసీ మురగయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.



కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

ఆ మృగాళ్లపై ఎన్నో అనుమానాలు!



సామూహిక లైంగికదాడి జరిగిన ప్రాంతం



చిత్తూరులోని అటవీశాఖకు చెందిన నీవా-నగరవనం

- చిత్తూరు గ్యాంగ్‌రేప్ ఘటనలో కీలకంగా వీడియోలు
- పలుచోట్ల ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డట్లు అనుమానాలు
- పార్కుల్లో ఏకాంత వీడియోలు.. ఆపై అఘాయిత్యాలే ప్రవృత్తి
- జిల్లా కేంద్రంలో వరుస ఘటనల కలకలం.. కొరవడిన నిఘా

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఓ మైనర్ బాలికపై జరిగిన సామూహిత లైంగికదాడి ఘటనలో పట్టుబడ్డ నిందితుల తీరు ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. అసలు జిల్లా కేంద్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు.. చైన్ స్నాచింగ్‌లు, దోపిడీలు పోలీసు శాఖ పనితీరును ప్రశ్నిస్తోంది. ఉన్న స్టేషన్లలో పోస్టింగులు కాపాడుకోవడానికి చూపుతున్న విశ్వాసం .. ప్రజల్లో పోలీసుశాఖపై నమ్మకం కలిగిద్దామనే ఆలోచన కొందరు ఖాకీల్లో కనిపించడం లేదు. మరోవైపు సామూహిత లైంగికదాడి ఘటనలో నిందితుల వద్ద లభించిన వీడియోలన్నీ కూడా అటవీశాఖకు చెందిన నగరవనంలోవే కావడం.. ఫారెస్టు అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది.

వీడియోల్లో ఏముందంటే?

నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎం.మహేష్, పి.కిషోర్, జె.హేమంత్ వద్ద మొబైల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందులో పలువురు ప్రేమికులు, స్నేహితులు సన్నితంగా ఉండే వీడియోలు గుర్తించామన్నారు. దీని ప్రకారం నిందితులు ముగ్గురూ కరుడుగట్టిన మృగాలని అర్థమవుతోంది. చిత్తూరు–తిరుపతి రోడ్డులోని అటవీశాఖకు చెందిన నగరవనంపై ఈ ముగ్గురికీ పూర్తిగా పట్టు ఉన్నట్లు తెలుస్తోంది. పార్కులోపలకు వచ్చే ప్రేమజంటలు, స్నేహితులు, దంపతులను ఫాలో అవుతూ వెళ్లడం.. వాళ్లు సన్నిహితంగా ఉండే వీడియోలు తీయడం అలవాటుగా మారింది. ఆపై వీడియోలను చూపించడంతో 'వీటిని మా ఇంట్లో చూపిస్తే నన్ను చంపేస్తారు. మీ కేం కావాలి..' అని అడిగితే అక్కడికక్కడే వాళ్లను బ్లాక్‌మెయిల్ చేసి అఘాయిత్యాలకు పాల్పడడం, కొందరి నుంచి డబ్బు, నగలు దోచుకోవడం ప్రవృత్తిగా మార్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. చాలామంది బాధితులు విషయం బటయకు చెబితే పరువుపోతుందని, పెద్దలు చదువు మాన్పిస్తారని, పనులకు పంపరని ఎక్కడా కూడా చెప్పుకోలేదు. మైనర్‌బాలికపై జరిగిన అఘాయిత్యం వెలుగులోకి రావడంతో, ముగ్గురు నిందితులపై మరికొన్ని ఫిర్యాదులు రావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుత కేసులో కూడా నిందితులకు వ్యతిరేకంగా ఫోరెన్సిక్, ఫింగర్‌ప్రింట్, సాంకేతికపరమైన కీలక సాక్ష్యాలు సేకరించిన పోలీసులు.. నేర నిరూపణకు బలమైన డాక్యుమెంటేషన్ సిద్ధం చేసినట్లు సమాచారం.

ఖాకీల పనితీరు ప్రశ్నార్థకం!

చిత్తూరులో ఇటీవల జరుగుతున్న పలు ఘటనలు పోలీసుల పనితీరును ప్రశ్నిస్తున్నాయి. నేరం జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడం, ఆభరణాలు సీజ్ చేయడం వరకు హర్షించదగ్గ విషయమే. కానీ ఇదే సమయంలో నేరం జరగకుండా ఆపాల్సిన బాధ్యత కూడా పోలీసులపై ఉందనే విషయాన్ని ఖాకీలు మరచిపోతున్నారు. వేలూరు రోడ్డులోని ఫారెస్టు వద్ద ప్రేమ జంటలు, స్నేహితులే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడ్డ అఖిల్ ఘటన కూడా నెలల తరబడి బయటకు వచ్చింది. ఇలాంటి ఘటనలు పోలీసు నిఘా, పట్రోలింగ్ చేసే పద్ధతులను ప్రశ్నిస్తోంది. పట్టపగలు, మధ్యాహ్నం వేళల్లో కూడా ఈ తరహా ఘటనలను నియంత్రించడం పోలీసులకు చేతగాలేదనే చెప్పాలి. కొందరు ఖాకీలు పేకాట క్లబ్బులు, లాటరీ నిర్వాహకులు, పంచాయితీల ద్వారా పొందే ఆర్థిక వనరులపైనే మక్కువ చూపిస్తున్నారు. పోస్టింగులు కాపాడుకోవడానికి అధికార పార్టీ నేతలు చెప్పినవాళ్లను వదిలేయడం, ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీ నేతలపై కేసులు పెడుతున్నారనే అపవాదు ఉంది.

నిఘా పెంచుతాం



చిత్తూరులో ఇటీవల జరిగిన ఘటనల్లో పోలీసుశాఖపై బాధ్యత పెంచింది. నేర నియంత్రణలో బీట్లను పెంచడం, పట్రోలింగ్ పటిష్టం చేయడంపై దృష్టి పెడతాం. లైంగిక దాడి ఘటనలో అటవీశాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. దీనిపై ఎస్పీతో మాట్లాడి ఫారెస్టు వాళ్లపై చర్యలకు సిఫార్సు చేసే విషయాన్ని పరిశీలిస్తాం. జరిగిన ఘటనలు మాకు కేసే తప్ప.. రాజకీయకోణం కాదు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, విద్యాసంస్థలు కూడా తెలుసుకోవాల్సిన బాధ్యత ఉంది. ఇలాంటి అఘాయిత్యాలు జరిగి ఉంటే పోలీసులకు చెప్పండి. మీ వివరాలు మేము బహిర్గతం చేయం. **– సాయినాథ్, డీఎస్పీ, చిత్తూరు**

శాస్త్రోక్తంగా రాహు కాల అభి షేకాలు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేపాకు తోరణాలతో ముస్తాబు చేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల వరకు సంప్రదాయ రీతిలో అమ్మవారికి అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, విశేష పుష్పాలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు బారులు తీరారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో భక్తులకు, ఉభయదారులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బోయకొండలో భక్తుల రద్దీ

కమనీయం..కల్యాణం





ఉభయ దేవేరులను కల్యాణ మాడిన ప్రసన్న వేంకటేశ్వరుడు (ఇన్ సెట్) కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం కమనీయంగా సాగింది. శ్రీవారి జన్మ నక్షత్రం అయిన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వేకువ జాము స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం పద్మావతీ, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరుడ్ని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి నూతన వధూవరులుగా తీర్చిదిద్దారు. ఆలయ పండిత బృందం ముందుగా గణపతి హోమం నిర్వహించింది. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల మధ్య మాంగల్యధారణను కమనీయంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రాజరాజేశ్వరీ దేవిగా బోయకొండ గంగమ్మ



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ గురువారం రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు గోవర్దనశర్మ, గంగిరెడ్డి తదితర అర్చక బృందం ఆధ్వర్యంలో ఆలయంలో ఏర్పాటుచేసిన అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద ఈఓ ఏకాంబరం తోపాటు ఉభయ దారులు గణపతి పూజ, అభిషేకాలు, అర్చనలు, ఊంజల్‌సేవ, చండీ హోమంతో పాటు పూర్ణాహుతి నిర్వహించారు. పది రోజుల పాటు జరిగిన దసరా మహోత్సవాలు ఎట్టకేలకు ముగిశాయి.

చక్రస్నానం.. ముక్తి స్థానం



స్వామి,అమ్మవార్లకు స్నపన తిరుమంజనం(ఇన్‌సెట్) పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

తిరుమల: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు.. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవ యజ్ఞ సమాప్తికి గురువారం తిరుమల పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. వేలాదిమంది భక్తుల గోవింద నామ స్మరణల మధ్య చక్రస్నానాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించింది. అనంతరం రాత్రి జరిగిన ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. తెల్లవారుజామున శ్రీవరాహస్వామి ఆలయం చెంత పుష్కరిణిలో చక్రతాళ్వార్లుకు స్నానం నిర్వహించే ముందు స్నపన తిరుమంజనం జరిగింది. శ్రీదేవి, భూదేవి, మలయప్ప స్వామి వారి చెంత చక్రతాళ్వార్లుకు అర్చకులు అభిషేక కైంకర్యాన్ని నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులు పుష్కరిణిలో పవిత్రస్నానం చేశారు.

ధ్వజావరోహణం

రాత్రి మలయప్ప స్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా బంగారు తిరుచ్చిలో తిరువీధుల్లో విహరించి ధ్వజస్తభం వద్దకు వేంచేశారు. ఇక్కడ గరుడునికి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభంపై ఉన్న గరుడ పటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా కిందకు దించారు. ఈ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తయ్యాయి.

భాగ్ సవారి

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తయిన మరుసటిరోజు భాగ్ సవారి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం స్వామివారు సాయంత్రం వైభవోత్సవ మండపం నుంచి బయలుదేరి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలందుకుని తిరిగి ఆలయంలోనికి ప్రవేశించారు.



ధ్వజావరోహణంలో హారతి ఇస్తున్న అర్చకులు



భాగ్ సవారీలో స్వామివారు

క్లుప్తంగా

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

యాదమరి: పలమనేరు–చిత్తూరు జాతీయ రహదారిలో ఓ ప్రైవేటు బస్సు ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్ కథనం మేరకు.. మండల పరిధి లక్ష్మయ్యకండ్రిగ గ్రామానికి చెందిన మునిరత్నం(68) ప్రముఖ వార్తా పత్రికలను ఇంటింటికీ చేరవేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గురువారం యథావిధిగా ఉదయం 6 గంటలకు న్యూస్ పేపర్ వేస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతున్న సమయంలో బెంగళూరు నుంచి చిత్తూరు వైపుగా అతివేగంతో ప్రయాణిస్తున్న ఓ ప్రైవేటు బస్సు అతన్ని ఢీకొట్టింది. తలపై నుంచి వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

నీటి నాణ్యతపై ఫిర్యాదు చేయండి

చిత్తూరు అర్బన్: ప్యాకేజీ తాగునీటి నాణ్యతలో తేడా ఉంటే ప్రజలు టోల్ ఫ్రీ – 086482410295, సెల్–9440379755 సెల్ నంబర్లకు ఫిర్యాదు చేయాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి సూచించారు. శుక్రవారం చిత్తూరులోని కలెక్టర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులతో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్రమాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ తాగు నీటిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, మినరల్ వాటర్ ప్లాంట్లపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు.

విస్తృత అవగాహన

చిత్తూరు అర్బన్: సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్‌పై అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చిత్తూరు జేసీ జీ.విద్యాధరి ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ – సూపర్ తగ్గింపు అనే నినాదంతో.. కలెక్టరేట్ ఆవరణ నుంచి ర్యాలీని జేసీ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధాల రంగాల రైతులకు యంత్రాలపై జీఎస్టీ 12 నుంచి 5 శాతం తగ్గిందన్నారు. ట్రాక్టరు, టైర్లు, పంపులు, హార్వెస్టర్లపై గతంలో 12 – 18 శాతం ఉన్న జీఎస్టీ.. ఇపుడు 5 శాతానికి తగ్గించారన్నారు.

పిడికిలి బిగించిన పల్లె వైద్యులు!

- జిల్లాలో పీహెచ్‌సీ వైద్యుల విధుల బహిష్కరణ
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎదుట సమ్మెకు దిగిన వైనం
- సమ్మెతో పల్లె వైద్యం దూరం



జిల్లా కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో పల్లె వైద్యులు పిడికిలి బిగించారు. శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. డిమాండ్ల పరిష్కారం కోసం నినాదాలు మిన్నంటించారు. వైద్యుల సమ్మెతో రోగులు విలవిల్లాడిపోయారు. మొదలే సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారు ఆర్‌ఎంపీలను ఆశ్రయించారు.

వ్యాధుల విజృంభణ

సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. వర్షాలకు మంచినీరు కలుషితమైపోవడంతో చాపకింద నీరులా విరేచనాలు ప్రబలుతున్నా యి. ఇలాంటి కీలక సమయంలో అధికారులతో సమ న్వయం చేసుకొని చర్యలు తీసుకోవడంతో పాటు, వైద్యులను సమ్మెలోకి వెళ్లకుండా చూడాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. మూలుగుతున్న నక్క మీద తాటికాయ పడిన చందంగా ప్రాథమిక వైద్యుల సమ్మెతో అసలే అంతంత మాత్రంగా అందుతున్న వైద్య సేవలు కూడా కొండెక్కాయి. గ్రామీణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

కార్యాలయం ఎదుట నిరసన

రాష్ట్ర యూనియన్ నాయకుల పిలుపుతో శుక్రవారం పీహెచ్‌సీ వైద్యులు జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. 50 మందికి పైగా వైద్యులు విధులను పక్కన బెట్టి సమ్మెలోకి దిగారు. దీంతో వైద్య సేవలు స్తంభించాయి. 104 సేవలకు సైతం బ్రేకులు పడ్డాయి. పల్లె జనం వైద్యం అందక పట్టణం, ప్రయివేటు వైద్యం కోసం పరుగులు పెట్టారు. కాగా వైద్యులు శిరీషా, ఎల్లయ్య, చంద్ర మహేష్ తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పీజీ వైద్యులతో..

జిల్లాలో 50 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరేసి వైద్యులు ఉండాలి. ప్రస్తుతం జిల్లాలో 90 మంది వైద్యులు పనిచేస్తున్నారు. మూడు రోజులుగా పీహెచ్‌సీ వైద్యులు అనివార్య కారణాలతో స్టెతస్కోప్ పక్కన పెట్టేశారు. గతంలో పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులకు పీజీలో 30 శాతం సీట్ల కోటా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే ఏకపక్షంగా సీట్ల కోటాను 15 శాతానికి తగ్గించేసింది. ఎంబీబీఎస్ వైద్యుల ఆశలపై నీళ్లు చల్లింది. దాంతో వైద్యులు ఆందోళన బాటపట్టారు. ఆ తర్వాత ప్రభుత్వం 20 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఒక ఏడాది మాత్రమే దాన్ని అమలు చేసిన ఆ తర్వాత పట్టించుకోకుండా పోయింది. ఈ సమస్యపై గత కొన్నాళ్ల నుంచి మిన్నకుండిపోవడంతో సమ్మెబాట పట్టాల్సి వచ్చింది. అధికారులు పలు పీహెచ్‌సీలకు పీజీ వైద్యులను తీసుకున్నారు. అదీ ఒక్కో డాక్టర్‌ను మాత్రమే నియమించారు. డాక్టర్లు లేని కారణంగా చాలా చోట్ల స్టాఫ్ నర్సులే వైద్యం చేసి మందు బిళ్లలిచ్చి రోగులను పంపించేశారు. రక్త పరీక్షలు, ఇతరత్రా సేవలన్నీ పడకేశాయి.

చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

పలమనేరు: పట్టణంలో గత నెల 26న మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు గ్రామంలో మోహన కుమారి ఇంట్లో చోరీకి సంబంధించిన కేసులో ఐదుగురు నిందితులను పట్టణ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం అరెస్ట్ చేసినట్టు పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ తెలిపారు. వీరి నుంచి 68 గ్రాముల బంగారు నగలు, కొన్ని రోల్‌గోల్డ్ నగలు, రూ.90 వేల నగదు, చోరీకి వాడిన పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. స్థానిక కేవీ స్ట్రీట్‌కు చెందిన సయ్యద్ అల్తాఫ్(17), నాగమంగళానికి చెందిన సయ్యద్ జావీద్(20), గడ్డూరు కాలనీకి చెందిన హరి(24), డీసీ స్ట్రీట్‌కు చెందిన ఫైజాన్ అహ్మద్(19), సాయి గార్డెన్స్‌కు చెందిన వినయ్‌కుమార్(25)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఇదే కేసులో మరో నిందితుడైన సందీప్ పరారీలో ఉన్నాడని, ఇతన్ని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఇందులో సీఐ మురళీమోహన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీ కుప్పంలో భారీ చోరీ



బంగారు వస్తువులు తీసుకొని పడేసిన వస్తువులు

నగరి : మండలంలోని కేజీ కుప్పం గ్రామానికి చెందిన నాగూర్ బాషా ఇంట్లో గురువారం రాత్రి 15 సవరాల బంగారు నగలు, అరకిలో వెండి, రూ.11 వేల నగదు చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 1న కుటుంబంతో సహా నాగూర్ బాషా తిరుపతికి వెళ్లి అక్కడ కుమార్తెను తీసుకొని 2వ తేదీ ఉదయం పెళ్లి చూపుల నిమిత్తం కడపకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆలస్యం కావడంతో రాత్రి తిరుపతిలో బసచేసి ఉదయాన్నే వచ్చేందుకు నిర్ణయించుకొని ఆగిపోయారు. ఇంటి వద్ద ఎవరూ లేకపోవడాన్ని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఉదయాన్నే ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడం, వస్తువులు చిందరవందరగా పడివుండడం చూసిన స్థానికులు నాగూర్ బాషాకు సమాచారం అందించారు. ఆయన హుటాహుటిన కేజీ కుప్పం చేరుకున్నని ఇంటిలోకి వెళ్లి చూడగా 15 సవరాల బంగారు నగలు, అరకిలో వెండి, రూ.11 వేలు నగదు చోరీ అయినట్లు గుర్తించారు. చోరీ జరిగిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పదోన్నతులు

చిత్తూరు అర్బన్: డీఈఓ పరిధిలోని పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. ఎంతో కాలంగా 166 మంది పండిట్లకు ఎట్టకేలకు పదోన్నతులు దక్కాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రాష్ట్ర విద్యాశాఖ నుంచి గురువారం మధ్యాహ్నం రాగా.. అప్రమత్తమైన విద్యాశాఖ అధికారులు రాత్రి 12.30 నుంచి 2.30 గంటలకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఎస్‌ఏలుగా పదోన్నతి, పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు.

మదపుటేనుగుల సంచారం



ధ్వంసమైన వరి

పలమనేరు : మండలంలోని మొసలిమడుగు సమీపంలోని కుంకీ ప్రాజెక్టు వద్ద బుధవారం రాత్రి మదపుటేనుగులు సంచరించినట్లు స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన పలువురు రైతుల వరిపైర్లను నాశనం చేశాయని వాపోయారు. అలాగే అరటి తోటలను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. గజదాడులను అరికట్టేందుకు ప్రభుత్వం తెప్పించిన కుంకీ ఏనుగుల సమీపంలోనే మదపుటేనుగులు సంచరిస్తున్నట్లు తెలిపారు. కుంకీల కారణంగా తమ పంటలకు మరింత నష్టాలు వచ్చే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండిళ్లలో చోరీ



ఇంట్లో చిందరవందరగా వస్తువులు

నగరి : మండలంలోని ముడిపల్లె గ్రామంలో రెండిళ్లలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు.. ముడిపల్లెకి చెందిన నాగరాజస్వామి బుధవారం బొమ్మలకొలువు నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న మరో నివాసంలో రాత్రి బస చేశారు. ఉదయం నివాసానికి వెళ్లి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉంచిన 30 వేల నగదు, బొమ్మల కొలువులో అమ్మవారికి వేసిన రెండు సవరాల బంగారు గొలుసు చోరీ చేసి ఉండడం గమనించారు. ఆ నివాసానికి పక్కనే ఉన్న మరో నివాసంలో నివసించే నాగరాజు అనే ఉద్యోగి ఉద్యోగరీత్యా నగరి పట్టణంలో నివాసం ఉంటున్నారు. తన నివాసం పక్కనే ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంగతి తెలుసుకొని తన నివాసం వద్దకు వెళ్లి చూడగా ఆయన ఇంటి గొళెం కూడా తొలగించి ఉంది. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. పూజ గదిలో ఉంచిన ఒక సవరం బంగారు నగలు చోరీకి గురయ్యాయి.

మీరే సూదులేస్తారా?

- ఏ ధైర్యంతో రోగులకు సెలైన్ పెడుతున్నారు
- టీఎస్ రామచంద్రన్ పీఎంపీ క్లినిక్‌పై చర్యలు
- క్రిస్టల్ ల్యాబ్‌లో నిబంధనలు లేవని నిర్ధారణ
- పలమనేరులో డీఎంఅండ్‌హెచ్‌వో ఆకస్మిక దాడులు



నిబంధనలు పాటించని ల్యాబ్ సిబ్బందిపై మండిపడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

పలమనేరు: 'మీరసలే ప్రాథమిక వైద్యం చేయాల్సిన వారు.. ఎలా సూదులేస్తారు, మీరే మెడికల్స్ స్టోర్స్ ఎలా నిర్వహిస్తారు..?..' అని డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. పలమనేరులో కొందరు పీఎంపీలు సెలైన్ పెట్టడం, సూదులేయడం తదితరాలపై కొందరు ఇటీవల జిల్లా వైద్యశాఖాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీనిపై స్పందించిన ఆమె శుక్రవారం పట్టణంలోని పీఎంపీలు, నిబంధనలు పాటించని మెడికల్ ల్యాబ్‌లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆ మేరకు ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న టీఎస్ రామచంద్రన్, ఆయన సతీమణి మంజుల పీఎంపీలుగా ఉంటూ సూదులేయడం, వారే మందులనివ్వడం చూసి నిర్ఘాంతపోయారు. ఇలా ఇష్టానుసారంగా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతారా..? అంటూ నిలదీశారు. మరోవైపు మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఓ పీఎంపీ నిత్యం సెలైన్స్‌లు పెట్టడమే పనిగా పెట్టుకుందని తెలుసుకున్నారు. ఆమెపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిపారు. గంగమ్మతోపులోని క్రిస్టల్ ల్యాబ్ నిర్వాహకులు నిబంధనలు పాటించడంలేదని, వీరిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ యాక్టు మేరకు పీఎంపీలు ప్రాథమిక చికిత్సలు మాత్రమే చేయాలన్నారు. అయినా కొందరు కావాలనే సూదులేయడం, వారి వద్దే లైసెన్సు లేకుండా మెడికల్స్ నిర్వహించడం చేయడం తీవ్రమైన తప్పన్నారు. ఇకపై పలమనేరులోని ప్రతి ఆర్‌ఎంపీ, పీఎంపీపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

స్వచ్ఛతలో ఆరు రాష్ట్ర స్థాయి అవార్డులు



సుమిత్‌కుమార్, కలెక్టర్

చిత్తూరు అర్బన్: పరిశుభ్రత–స్వచ్ఛత కార్యక్రమంలో జిల్లాకు ఆరు అవార్డులు లభించాయి. గురువారం చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయంలో గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకల్ని నిర్వహించిన అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ మునిసిపాలిటీల విభాగంలో పలమనేరు, కుప్పం.. ఉత్తమ గ్రామ పంచాయతీ విభాగంలో కనుమాకులపల్లె (శాంతిపురం), స్వచ్ఛ అంగన్వాడీ కేంద్రం–కామినాయనిపల్లె (ఐరాల).. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయం–కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కడ), స్వచ్ఛ బస్ స్టేషన్ విభాగంలో చిత్తూరు బస్‌స్టాండు రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికైనట్లు కలెక్టర్ వెల్లడించారు. అక్టోబర్ 6న విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందుకోనున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా స్థాయిలో 48 అవార్డులు

స్వచ్ఛత విభాగంలో జిల్లా స్థాయిలో 17 విభాగాల్లో 48 అవార్డులు ఇవ్వనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ నెల నెల 6న చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో జరగనున్న వేడుకల్లో వీటిని ప్రదానం చేస్తామన్నారు. స్వచ్ఛ పురపాలక–పుంగనూరు, స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రాలు–ఇరికి పెంట (సోమల), ఆగరమంగళం (జీడీనెల్లూరు), బందార్లపల్లె (రామకుప్పం), మహాసముద్రం (బంగారుపాళ్యం) స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయం–జెడ్పీ కార్యాలయం చిత్తూరు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చిత్తూరు. స్వచ్ఛ పరిశ్రమ– షాహి ఎక్స్‌ఫర్ట్ స్వచ్ఛ ఎంఎస్‌ఎంఈ –రావాండ్స్ ప్లాస్టిక్, విశ్వా ఆపీరియల్స్ స్వచ్ఛ హాస్టల్–ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ (నగరి), ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్ (కుప్పం), ప్రభుత్వ గిరిజన బాలుర హాస్టల్ (కుప్పం). స్వచ్ఛ రెసిడెన్షియల్ పాఠశాల–డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం సర్వేరెడ్డిపల్లె (జీడీనెల్లూరు) స్వచ్ఛ ఆస్పత్రి–పీహెచ్సీ కొత్తపల్లె (కుప్పం), ఏరియా ఆస్పత్రి పలమనేరు, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి స్వచ్ఛ పాఠశాల– ఏపీ మోడల్ స్కూల్ తుమ్మిసి (శాంతిపురం), కేజీబీవీ (బైరెడ్డిపల్లె) జెడ్పీ ఉన్నత పాఠశాల బీరప్పచెరువు (ఐరాల), ఎంపీపీఎస్ కమ్మపల్లె (పులిచెర్ల), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బంగారుపాళ్యం) స్వచ్ఛ వారియర్స్– వెంకటేష్ (చిత్తూరు), శ్రీనివాసులు (పలమనేరు), రవిచంద్రన్ (నగరి), గంగమ్మ (కుప్పం), హరిబాబు (పుంగనూరు) స్వచ్ఛ హరిత రాయబారులు –విజయకుమార్ (అగరంపల్లె), బాలకష్ణ (పెద్దచల్లారగుంట), సావిత్రి (తూర్పు మాదిగవాడ), నాగరాజు (పెద్దచల్లారగుంట), బాలకృష్ణ (కొలమాసనపల్లె) స్వచ్ఛ గ్రామ పంచాయతీ–యమగానిపల్లె (గుడుపల్లె), కాణిపాకం (ఐరాల), కంగుంది (కుప్పం), మల్లానూరు (కుప్పం) స్వచ్ఛ స్లమ్‌లెవల్ ఫెడరేషన్–పొన్నెమ్మ మహిళా సమాఖ్య (నగరి) శ్రీలంజనేయ మహిళా సమాఖ్య (నగరి), శ్రీ విరుపాక్షి మహిళా సమాఖ్య (చిత్తూరు). స్వచ్ఛ రైతు బజారు కుప్పం వ్యవసాయ మార్కెట్, స్వచ్ఛ గ్రామ సంఘం–గడ్డంవారిపల్లె (చౌడేపల్లె), కొల్లాగుంట (కార్వేటినగరం) మాంగాడు (నగరి), ఏకరపల్లె (కుప్పం), నల్లిశెట్టిపల్లె (తవణంపల్లె) స్వచ్ఛ ఎన్జీవో– నేచుర్ లవర్స్ అసోసియేషన్ (చిత్తూరు), నాగమణి చారిటబుల్ ట్రస్ట్ (పలమనేరు), పలమనేరు పరిరక్షణ సమితి (పలమనేరు) ఎంపికయ్యారన్నారు.

తిరుచానూరులో అత్యాధునిక హోటల్

- అట్టహాసంగా లెమన్ ట్రీ హోటల్స్ ప్రీమియర్ ప్రారంభం



నూతనంగా ఏర్పాటైన లెమన్ ట్రీ హోటల్స్ ప్రీమియర్

చంద్రగిరి : తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు అత్యుత్తమ సేవలను అందించేందుకు తిరుచానూరులో అత్యాధునిక హంగులతో హోటల్ ఏర్పాటైంది. తిరుచానూరు సమీపంలోని జాతీయ రహదారికి అనుకుని లెమన్ ట్రీ హోటల్స్ ప్రీమియర్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానంద రెడ్డి, నగరి ఎమ్మెల్యే గాలి భాను, తిరుపతికి చెందిన పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం హోటల్‌లో ప్రత్యేక పూజలను నిర్వహించి, ముఖ్య అతిథిలు హోటల్‌ను ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ... డబుల్ హైట్, గ్రాండ్ డ్రాప్ ఆఫ్, మార్బుల్ ఫినిష్, స్టెయిన్ గ్లాస్ అలంకరణతో రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 100 సీట్ల సిగ్నేచర్ రెస్టారెంట్, లైవ్ కిచెన్, బఫేతో పాటు 30 సీట్ల సామర్థ్యం గల అల్ఫ్రెస్కో డైనింగ్‌ను సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంప్రదాయ రీతిలో వినియోగదారులను ఆకట్టుకునేలా మండపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పోర్ట్స్ బార్, స్పా, మల్టీపర్పస్ హాల్, 500 సీట్ల బ్యాంక్వెట్ హాల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. వేడుకలను జరుపుకునేందుకు ప్రత్యేకంగా స్థలం, రూఫ్ టాప్ ఇన్ఫినిటీ పూల్‌తో పాటు పవిత్ర తిరుమల దృశ్యాల మధ్య ఆహ్లాదకరమైన వసతులు అందిస్తున్నట్లు తెలిపారు.